క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అయ్యప్పస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల వద్ద బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. రాపూరుకు చెందిన తూమాటి అంకారావు గోవిందమాల వేసు కుని తిరుమలకు వెళుతున్న సందర్భంగా మహావిష్ణువు ఆలయంలో పూజలు, హోమాలు చేశారు. అనంతరం ఇరుముడి కట్టు కుని వెళుతూ భక్తులకు అన్నదానం చేశారు.

అగ్నిగుండ మహోత్సవం



పాండురంగస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేటలో వెలసిన రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయంలో అగ్ని గుండ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉపవాసంతో కంకణాలు ధరించారు. తొమ్మిది స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య అగ్నిగుండంలో ప్రవేశించారు.

నేడు వెంకటగిరికి నేదురుమల్లి రాక

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వెంకటగిరికి రానున్నట్టు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపారు. ఆయన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న గద్దల మునెయ్య

వెంకటగిరి(సైదాపురం): డప్పు కళను నమ్ముకుని జీవనం సాగిస్తున్న కళాకారులను ఆదుకోవాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆయన బుధవారం వెంకటగిరిలో కళాకారులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. పింఛను పెంపుపై సంతకం చేశారని, డప్పు కళాకారులకు పింఛను అమలు గురించి పట్టించుకోలేదని వాపోయారు. పింఛను అమలచేయడంతోపాటు నగదు పెంపుపై చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కండలేరులో 6.330 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.330 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్‌పై మూకుమ్మడి దాడి



గాయపడిన సునీల్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని పండ్లూరు వద్ద బుధవారం కొందరు యువకులు ఆటో డ్రైవర్ సునీల్‌పై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. అయ్యప్పరెడ్డిపాళెంకు చెందిన ముమ్మడి సునీల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న సునీల్ ఆటోలో పాలు తీసుకుని వస్తున్నాడు. పండ్లూరు వద్ద ఆటో మలుపు తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన సందీప్‌కు తగిలింది. దీంతో సునీల్, సందీప్ మధ్య గొడవ జరిగింది. బుధవారం సునీల్ పండ్లూరు గ్రామ సమీపంలోని ఓ దుకాణం వద్దకు వచ్చాడు. గమనించిన సందీప్, రమేష్ మరి కొంతమంది యువకులతో కలిసి సునీల్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ తోటల పెంపకంతో ఆదాయం

ఏర్పేడు: పామాయిల్ తోటల పెంపకంతో రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చని త్రీ ఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం మురళి తెలిపారు. మండలంలోని సరస్వతికండ్రిగలో బుధవారం పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ సూచనల మేరకు పామాయిల్ తోటల పెంపకం చేపడితే దిగుబడులు పెరిగి ఆదాయం చేకూరుతుందని వివరించారు. త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ రాజేష్, ఏర్పేడు క్లస్టర్ మేనేజర్ గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కోట : ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



రాపూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

కోట: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి సూచించారు. కళాశాలలో బుధవారం నేషనల్ యాంటీ డ్రగ్‌డేను నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి, పొగాకు వంటి వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు లోను కాకుండా తమ సమయాన్ని ఆటలు, యోగా, కళల మీద దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, జయరావు, ఎన్‌సీసీ అధికారులు గణేష్, నరేంద్రబాబు, మాధవయ్య, మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

యువత మేలుకో.... మత్తును వదులుకో

నాయుడుపేట టౌన్: యువత మేలుకో.. మత్తును వదులుకో అని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అరుణకుమారి, ఎస్ఐ గోపి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఎస్ఈబీ, పోలీసు అధికారుల సారథ్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని టీఎంఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం





నాయుడుపేట: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, గూడూరు టవర్ క్లాక్ సెంటర్ వద్ద విద్యార్థుల మానవహారం

కళాశాల నుంచి విద్యార్థులు, పోలీసు సిబ్బంది పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అక్కడ ప్లకార్డులు ప్రదర్శించి మానవహారం ఏర్పాటుచేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయుడుపేట ఎస్ఈబీ ఎస్ఐ మునీర్ అహ్మద్, టీఎంఆర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: యువత మాదకద్రవ్యాలకు బానిస కాకూడదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయుడు తెలిపారు. రాపూరులో బుధవారం యాంటి డ్రగ్స్ డేను నిర్వహించారు. విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ మాల్యాద్రి, డాక్టర్ హరీష్, గౌతమ్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఈబీ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సింహపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో బుధవారం డ్రగ్స్ నియంత్రణ దినోత్సవం నిర్వహించారు. ఎస్ఐ జిత్యానాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే భవిష్యత్తు నాశనం అవుతుదన్నారు. సింహపురి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిమెట్ల ఉదయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి, సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పోచినేని ప్రవీణ్‌కుమార్, సైపుద్దీన్, సాయి, నీకేష్, విష్ణు వర్దన్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్: యువత మత్తుకు బానిసలుగా మారితే జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఈబీ సెబ్ అసిస్టెంట్ ఎస్పీ జె.రమేష్ తెలిపారు. గూడూరు పట్టణంలో బుధవారం యాంటీ డ్రగ్ డేను నిర్వహించారు. అనంతరం సిరామిక్, ఐటీఐ కళాశాలలో విద్యార్థులతో కలిసి టవర్ క్లాక్ ప్రాంతంలో మానవ హారం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిసి అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ ఎం.రమేష్, ఎస్ఐ మోసెస్, సిరామిక్, ఐటీఐ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేస్తున్న రిసోర్స్‌పర్సన్, ఎంఈవోలు

నాయుడుపేట టౌన్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు ఎం.శాంతి, మునిరత్నం కోరారు. వారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్య ప్రవేశం పేరిట పిల్లలందరూ బడిలో ఉండాలి అనే కార్యక్రమంపై రిసోర్స్ పర్సన్ శరత్‌చంద్ర అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మండలంలోని పాలకొండసత్రంలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన 14 మందిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. ఆయన బుధవారం పాలకొండ సత్రం గ్రామానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాలకొండ సత్రం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తహసీల్దార్ సాంబశివరావు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

దక్కిలి: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీడీ వరకుమార్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని దినాలు తప్పనిసరిగా కల్పించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలకు గిట్టుబాటు కూలి అందేలా పనులు కల్పించాలన్నారు. అనంతరం పంచాయతీల వారిగా పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు షఫీ, గిరి, సరిత, బీఎఫ్‌టీ శివయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ వరకుమార్

గేదెలకు టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఓజిలి: మండలంలోని కుందాం గ్రామానికి చెందిన రైతుల గేదెలకు బుధవారం పశువైద్యాధికారి గౌతమ్, అసిస్టెంట్ ప్రశాంతి టీకాలు వేశారు. ఇటీవల మెడ వాపు వ్యాధితో 4 లేగదూడలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న వైద్యసిబ్బంది గేదెలకు టీకాలు వేసి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూగజీవాలు పచ్చిక తినడంతో గొంతు వాపు వ్యాధి వస్తుందన్నారు. జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

దుప్పలవారికండ్రిగలో బాలుడికి డెంగీ జ్వరం

దొరవారిసత్రం: వెదురుపట్టు పంచాయతీ దుప్పలవారికండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన కోట్లపాటి అంకయ్య కుమారుడి (17 నెలలు)కి డెంగీ జ్వరం వచ్చింది. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు బుధవారం కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బాలుడికి వారం రోజుల నుంచి జ్వరం వస్తుండడంతో నాయుడుపేట పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో తిరుపతిలోని రూయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేయగా డెంగీ జ్వరంగా నిర్ధారణ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్‌బాబు, స్థానిక సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఎస్టీ కాలనీలో డోర్ టూడోర్ లార్వా సర్వే చేశారు. పారిశుద్ధ్య పనులు చేశారు. ఇంటింటిలో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది సుధాకర్, అమరావతి, పావని, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



దుప్పలవారికండ్రిగ ఎస్టీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న వైద్య సిబ్బంది

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆమెను మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం గాంధీ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కరుణామయి విద్యాలయ నిర్వాహకుడు విజయ్ భరత్ తెలిపారు. రాపూరు, గొనుపల్లిలోని కరుణామయి విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు బుధవారం ఉచితంగా పాఠ్య, నోటుపుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బిడ్డా చదువుకోవాలన్న లక్ష్యంతో మాతృదేవి విజయేశ్వరిదేవి ఉచిత పాఠశాలలు ఏర్పాటు చేసి చిన్నారులకు ఉచిత విద్య అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లితండ్రులకు గ్రామానికి, విజయేశ్వరిదేవికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శంకరయ్య, మస్తానయ్య, పాఠశాలల ఇన్‌చార్జి వెంకట్రాయులు, వినోద్ పాల్గొన్నారు.



గోనుపల్లిలో పుస్తకాలు అందజేస్తున్న విజయభరత్

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద పిల్లలకు దాతలు విద్యా సామగ్రి అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం దాత శ్రీకాంత్ ఇచ్చిన విద్యా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. భాస్కరరెడ్డి, వెంకటేశ్వర్లురాజు, సురేంద్ర, వెంకటకృష్ణయ్య, శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఓజిలి: నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె బుధవారం మాచవరంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల కోరిక మేరకు శ్మశానానికి రోడ్డు ఏర్పాటుచేస్తామన్నారు. మురుగు కాలువను శుభ్రం చేయిస్తామని చెప్పారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, పార్థసారథి, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, నాయకులు పొదర్తి ప్రకాష్‌నాయుడు, కిరణ్‌నాయుడు, సురేష్‌నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పారిశుద్ధ్య పనులతో దోమల నియంత్రణ



పెళ్లకూరు : రోసనూరులో క్లోరినేషన్ చేస్తున్న అధికారులు



దక్కిలి: డయేరియాపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

పెళ్లకూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడం వల్ల దోమల వ్యాప్తిని నివారించవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణారావు తెలిపారు. రోసనూరు గ్రామంలో బుధవారం తాగునీటి కొళాయిలు, బోర్ల వద్ద చెత్త, చెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి బావులు, మంచినీటి పథకాలకు క్లోరినేషన్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఏఈ ప్రకాష్, కార్యదర్శి సుహాసిని, సుస్మిత పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన

దక్కిలి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లీలామాధవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వారు బుధవారం కమ్మపల్లి, వెంబులూరు, దేవుని వెల్లంపల్లి తదితర గ్రామాల్లో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటిని చల్లార్చి తాగాలని అన్నారు. అదే విధంగా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు మండలంలోని పాఠశాలలను పరిశీలించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలు చోట్ల తాగునీటిని పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



చిల్లకూరు: చింతవరంలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఆర్‌ఓ ప్లాంట్ల పరిశీలన

చిల్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఆయన బుధవారం పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను పరిశీలించారు. చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శివసుబ్రమణ్యంతో కలిసి పిల్లలకు డయేరియాపై అవగాహన కల్పించారు. నీరు కలుషితం కావడం వల్ల డయేరియా వస్తుందని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సర్వేయర్ మల్లికార్జున్ ఉన్నారు.

వసతి గృహాల పరిశీలన

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఎస్సీ బాలికలు, బీసీ బాలుర వసతి గృహాలను బుధవారం తహసీల్దార్ కల్యాణి, మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, పలు శాఖల అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, తదితర విషయాలపై ఆరా తీశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వార్డెన్లకు సూచించారు. డయేరియా ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



నాయుడుపేట : భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నాయుడుపేట: వసతి గృహం వద్ద అధికారులు

కేజీబీవీ పాఠశాల తనిఖీ

దొరవారిసత్రం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, కూరగాయలు, వంట నూనెలు తదితరాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని అందజేయాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే పీహెచ్‌సీకి తరలించాలని పేర్కొన్నారు. ఆయన వెంట యూనిట్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఎస్‌వో పార్వతి, వైద్య సిబ్బంది సుధాకర్, మౌనిక, మురళి, సుమతి ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యాధికారి చైతన్య

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

సైదాపురం: ప్రజల అభిప్రాయాలను అమలు చేయాల్సిన బాధ్యత మైనింగ్ యజమానులపై ఉంటుందని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. మండలంలోని జోగిపల్లి సమీపంలోని స్టార్ మినరల్స్ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జోగిపల్లిలో సర్వే నంబర్ 11ఎ, 11బీలో 7.83 హెక్టార్లలో మైనింగ్ నిర్వహించేందుకు పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయా సేకరణ కార్య క్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రజలు, నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పలు సమస్యలను కమిటీ ముందుంచారు. మైనింగ్ సమీపంలో గతంలో అక్రమంగా తవ్వకాలు చేపట్టారని, వాటిలో పంట కాలువలు కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మైనింగ్ యాజమాన్యం పంట కాలువను ఏర్పాటుచేస్తామన్నారు. జోగిపల్లి అభివృద్ధి వృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్విరాన్‌మెంట్ అధికారి రాజశేఖర్, డీఎస్పీ కోటారెడ్డి, గని యాజమానులు దయాకర్, సుధీర్, రాఘవేంద్ర, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, రాపూరు సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ డీపీ విజయకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్



సమావేశానికి హాజరైన ప్రజలు